సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 12 । డిసెంబర్ । 2024





### ప్రభుత్వ కళాశాలకు 'ఐఎస్ఓ'

తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు లభించినట్టు ఐఎస్ఓ సంస్థ ప్రతినిధి శివయ్య తెలిపారు. 2లో ▸



### స్విమ్మింగ్‌లో పతకాలు

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరు జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. మొత్తంగా 32 పతకాలు సాధించారు. 2లో ▸




### సొమ్ములు బొక్కేస్తున్నారు

ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ములు, ఇతర ఆదాయాలను కొందరు పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది కలిసి స్వాహా చేస్తున్నారు. 2లో ▸

# 6 నెలలు సంక్షేమానికి తూట్లు

అంతన్నారు.. ఇంతన్నారు.. అధికారంలోకి రావడమే ఆలస్యమన్నారు.. ప్రచార సభల్లో సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టారు.. పశ్చిమగోదావరి జిల్లాను కూటమి నేతలు హామీల వరదలో ముంచెత్తారు.. తీరా పాలనా పగ్గాలు చేపట్టి ఆరు నెలలు గడిచినా హామీల ఊసే ఎత్తడం లేదు.. సంక్షేమానికి తూట్లు పొడుస్తూ గాలిలో హామీలతో పాలన సాగిస్తున్నారు. గతేడాది ఇదే కాల వ్యవధిలో జిల్లాలోని లక్షల మంది పేదలకు రూ.556.9 కోట్ల లబ్ధిని చేకూర్చారు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**ప్రజలకు అరగుండు**

- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు
- జాడలేని సూపర్ సిక్స్ హామీలు
- జిల్లాకు ఇచ్చిన వాగ్దానాల ఊసెత్తని పాలకులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇదే కాలంలో రూ.556.9 కోట్ల లబ్ధి
- ఈ మేరకు నష్టపోయిన రైతులు, విద్యార్థులు, సామాన్య వర్గాలు




సాక్షి, భీమవరం : రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. గురువారంతో ఆరు నెలల పాలన పూర్తవుతుంది. సూపర్ సిక్స్‌ను ప్రచారాస్త్రంగా చేసుకున్న చంద్రబాబు ఇప్పుడు వాటి ఊసెత్తడానికే భయమేస్తోందంటూ చేతులెత్తేశారు. పింఛన్ సాయాన్ని రూ.వెయ్యికి పెంచి కొత్తవి మంజూరు చేసే విషయమై నోరు మెదపడం లేదు. ఏడాదికి మూడు సిలెండర్లు ఇస్తామని చెప్పి ఒక్కదానితో సరిపెట్టారు. సూపర్ సిక్స్‌లో ప్రధానమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రస్తావనే లేదు.

**జిల్లాకు ఇచ్చిన హామీల మాటేంటి?**

పాలకొల్లులో శ్రావణమాసంలోనే టిడ్కో ప్లాట్లు పంపిణీ చేస్తామన్నారు. నరసాపురంలో వశిష్ట గోదావరిపై వంతెన, తణుకులో హైటెక్ టవర్ నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, తాడేపల్లిగూడెంను మార్కెట్, ఎడ్యుకేషన్ హబ్‌లుగా అభివృద్ధి చేయడం, అన్యాక్రాంతమైన తాడేపల్లిగూడెం ఎయిర్‌పోర్టు భూములను కాపాడటం, ఆచంటలో గోదావరిపై వారధి నిర్మాణం, ఆకివీడులో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, ఆక్వా రంగం అభివృద్ధి కోసం 500 టన్నుల కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, ఏరియేటర్స్‌పై సబ్సిడీ, విజ్జేశ్వరం నుంచి ప్రాజెక్టెడ్ వాటర్ స్కీమ్ ద్వారా జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, భీమవరంలో ఎయిర్‌పోర్టు, డంపింగ్ యార్డు ఏర్పాటు.. తదితర వాగ్దానాల అమలు దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు ఇప్పటివరకు ఒక్క అడుగు వేసిందీ లేదు. గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయకపోవడంతో జిల్లాలోని పేదవర్గాల వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. సామాన్యుల్లో కొనుగోలు శక్తి తగ్గిన పరిస్థితుల్లో నిత్యావసరాల ధరల పెరిగి సతమతమవుతున్నారు.

**గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023 జూన్ నుంచి డిసెంబర్ వరకు ప్రజలకు అందిన లబ్ధి**

| పథకం | లబ్ధిదారులు | లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|
| అమ్మఒడి | 1,43,534 | 21.05 |
| వైఎస్ఆర్ లా నేస్తం | 192 | 0.57 |
| విదేశీ విద్యాదీవెన | 6 | 1.25 |
| వైఎస్ఆర్ నేతన్ననేస్తం | 1,027 | 2.46 |
| జగనన్న తోడు | 95,239 | 95.24 |
| జగనన్న విద్యాదీవెన | 42,827 | 101.81 |
| వైఎస్ఆర్ కాపునేస్తం | 34,642 | 51.96 |
| వైఎస్ఆర్ వాహనమిత్ర | 13,201 | 13.2 |
| వైఎస్ఆర్ చేయూత | 84,523 | 155.73 |
| వైఎస్ఆర్ రైతు భరోసా | 1,26,645 | 50.65 |
| జగనన్న వసతి దీవెన | 42,197 | 42.19 |
| కల్యాణమస్తు, షాదీతోఫా | 383 | 2.74 |
| జగనన్న చేదోడు | 9,698 | 9.7 |
| జగనన్న విద్యాదీవెన | 26,685 | 20.8 |

**గతేడాది ఇదే కాలంలో..**

2023 జూన్ నెల నుంచి డిసెంబరు నెలాఖరు వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు కోట్లాది రూపాయల లబ్ధిని చేకూర్చింది. జూన్‌లో జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, వైఎస్సార్ లా నేస్తం (మొదటి విడత), జూలైలో జగనన్న విదేశీ విద్యాదీవెన, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న తోడు (మొదటి విడత), డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు, ఆగస్టులో జగనన్న విద్యాదీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర, సెప్టెంబరులో వైఎస్సార్ చేయూత, అక్టోబరులో వైఎస్సార్ రైతు భరోసా (రెండో విడత), జగనన్న వసతి దీవెన (తొలి విడత), నవంబరులో వైఎస్ఆర్ సున్నావడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా (మూడో త్రైమాసికం), డిసెంబరులో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న చేదోడు పథకాలతో కోట్లాది రూపాయల లబ్ధి చేకూర్చింది. పేదల జీవితాల్లో వెలుగులు నింపారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

### కాపునేస్తం ఊసేలేదు



కాపులలో అల్పాదాయ వర్గాలకు కాపు నేస్తం పేరుతో గత ప్రభుత్వం ఐదేళ్లపాటు ఆర్థిక సాయం అందించింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కావస్తున్న ఇప్పటివరకూ కాపు నేస్తం ఊసేలేదు. కాపు సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుంది. న్యాయం చేయాలి

– కె.మధు కల్యాణి, తాడేపల్లిగూడెం

### పథకాల మాటెత్తడం లేదు



కూటమి ప్రభుత్వంలో చేనేత కార్మికులకు ఎలాంటి మేలు జరగలేదు. గద్దెనెక్కి ఆరు నెలలైనా సంక్షేమ పథకాల మాటెత్తడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకంలో ఏడాదికి రూ.24 వేలు అందించారు.

– చల్లా సాంబయ్య, చేనేత కార్మికుడు, చింతపర్రు, పాలకొల్లు మండలం

### సాయం చేయకపోగా కేసులా..



ఆటో జీవనాధారంగా బతికే నేను గత ఐదేళ్లలో వాహన మిత్ర సాయం అందుకున్నాను. కరోనా వంటి విపత్కర సమయంలోనూ సాయం అందించారు. ఈ మొత్తంతో వాహన మరమ్మతులు వంటి పనులు చేయించాను. కూటమి ప్రభుత్వంలో వాహన మిత్ర వేయకపోగా వాహనాలపై కేసులు రాస్తున్నారు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం.

– గంట విజయ్‌కుమార్ రాజు, మల్లవరం, నరసాపురం మండలం

### అమ్మఒడి అందేనా..



నాకు ఇద్దరు ఆడపిల్లల సంతానం. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి కింద ఏటా సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పేరిట సాయం పెంచుతామని చెప్పి హామీలు ఇచ్చారు. ఇప్పటివరకూ ఆ ఊసేలేదు. అమ్మఒడి ఆశలు అడియాసలయ్యాయి.

– నక్క ఆదెమ్మ, పెనుగొండ

### అప్పు చేసి ఫీజు కట్టాను



మా అబ్బాయి ఇంజినీరింగ్ మూడో ఏడాది చదువుతున్నాడు. గత రెండేళ్లు వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. అయితే ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల నుంచి ఫీజుల కోసం ఒత్తిడి పెరిగింది. దీంతో రూ.72 వేలు అప్పు చేసి మరీ ఫీజు చెల్లించాను. కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– జిల్లూరి జగదీష్, తణుకు

### పేదలకు ఇబ్బందులు



గత ప్రభుత్వంలో 45 ఏళ్లు నిండిన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం అందించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేయడమే కాకుండా ఏ పథకం అమలు చేయడం లేదు. దీంతో మాలాంటి పేదలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– వి.జూలియమ్మ, మోగల్లు, పాలకోడేరు మండలం

## న్యూస్‌రీల్

### జేసీని కలిసిన టీచర్ ఎమ్మెల్సీ



జేసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి గురువారం భీమవరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయులకు సంబంధించి పలు విషయాలపై జేసీతో చర్చించారు.

### కలెక్టర్ల సదస్సులో నాగరాణి



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రెండు రోజులపాటు జరుగనున్న కలెక్టర్ల సదస్సులో పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల పరిష్కారంలో అనుసరించాల్సిన విధి విధానాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**13న 'స్వర్ణాంధ్ర' ఆవిష్కరణ**

విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 13న స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరిస్తారని కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రోన్ షో, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు.

### విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న దృశ్యం

భీమవరం: సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని తక్షణం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగపు చార్జీలు కంటే పలు రెట్లు అదనపు చార్జీలు వేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు విద్యుత్ బిల్లులు నియంత్రిస్తామని ప్రకటించారని, ఇప్పుడు ట్రూఅప్ పేరుతో పెంచడం అన్యాయమన్నారు. సూపర్ సిక్స్ అంటూ మేనిఫెస్టో ప్రకటించి ఇప్పుడు ప్రజలపై భారాలు వేయడం తగదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం విరమించుకోవాలని, సూపర్ సిక్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, కె.క్రాంతి బాబు తదితరులు పాల్గొన్నారు.

### రేపు జాబ్‌మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఎస్‌వీసీ ట్రైనింగ్ సెంటర్ (స్కిల్ హబ్)లో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్ర బాబు ఓ ప్రకటనలో తెలిపారు. బజాజ్ క్యాపిటల్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ చిట్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 90 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–30 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు సెల్ 91823 42688, 96525 03799 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరు కావాలని సూచించారు.

### 18 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉద్యోగంలో పదోన్నతులు ఆశించే వారు డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు 24 ఏళ్ల పదోన్నతి స్కేల్ పొందాలన్నా, స్కూల్ అసిస్టెంట్లు 12 ఏళ్ల పదోన్నతి స్కేల్ పొందాలన్నా డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కాగా ఈనెల 18 నుంచి జరుగనున్న రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల, ఉద్యోగులు రాసే డిపార్ట్‌మెంటల్ పరీక్షల హాల్‌టికెట్లు గురువారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

## పాడి గేదెల వధ తణుకుకే అరిష్టం

- ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి పంచాయతీ పరిధిలో సత్యవాడ రోడ్డులో లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో నిర్వహిస్తున్న గోవులు, పశువుల వధ తణుకు ప్రాంతవాసులు అరిష్టంగా భావిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన నివాసంలో 'సాక్షి'తో మాట్లాడారు. ప్రశాంతతకు మారుపేరైన తణుకు ప్రాంతంలో జీవహింస చేయడం బాధాకరమన్నారు. ఈ సమస్యపై చాలా మంది స్థానికులు, తణుకువాసులు నిత్యం తనకు ఫోన్‌ల ద్వారా, నేరుగా కలిసి గోవులు, పశువులను వధిస్తున్న కర్మాగారాన్ని తక్షణమే మూయించేందుకు కృషి చేయాలని కోరుతున్నారన్నారు. చీకటిపడగానే గోవులు, పగలంతా గేదెలను వధిస్తూ ఆ ప్రాంతాన్ని దుర్గంధభరితంగా మారుస్తున్న కర్మాగారాన్ని మూయించేలా ప్రజలు, గో సంరక్షకుల కోరిక మేరకు తాను పోరాటానికి దిగే ఉద్దేశంలో ఉన్నానని చెప్పారు. అధికారులను పంపించి పరిశీలించమని ఆదేశిస్తానని ఎమ్మెల్యే రాధాకృష్ణ చెప్పిన నేపథ్యంలో ఈనెల 26 వరకు వేచిచూస్తానని అప్పటికీ ఈ కర్మాగారాన్ని మూయించలేని పరిస్థితుల్లో 20 వేల మంది గోసంరక్షకులు, ప్రజలతో కలిసి తణుకులో శాంతి మార్చ్ నిర్వహించ తలపెట్టినట్టుగా కారుమూరి చెప్పారు. ప్రజల మనోభావాలకు ప్రాధాన్యమివ్వడమే లక్ష్యంగా పోరాటం చేస్తానని అన్నారు. రోజురోజుకీ ఈ కర్మాగారాన్ని మూయించాలంటూ ప్రజల్లో చైతన్యం వస్తుందని వారికి అండగా ఉంటానన్నారు.

**పాడి గేదెలను వధిస్తున్నారు**

లక్షల రూపాయిలు ఖరీదు చేసే అధికంగా పాలిచ్చే గేదెలను సైతం ఇక్కడ చిత్రవధ చేసి చంపేయడం చాలా బాధగా ఉందని కారుమూరి అన్నారు. అంతేకాక ఆ రక్తాన్ని, వ్యర్థాలను పంట కాలువల్లోకి వదిలేయడం ద్వారా ఇటు పాడి పంటలు అడుగంటిపోతాయని, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం పెరిగిపోయి తణుకు ప్రాంతం కరువు కాటకాలతో అల్లాడిపోయే పరిస్థితి దాపరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు అనారోగ్యాలతో సరైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న తణుకువాసులకు పశు వధ నిర్వహిస్తున్న కర్మాగారం మరింత తలనొప్పిగా మారిందన్నారు. ఈ కర్మాగారం ఏర్పడిన రోజు నుంచి గేదెల దొంగతనాలు పెరిగిపోయాయన్నారు. అన్నపూర్ణలాంటి తణుకు నేలపై రక్తం ఏరులై పారిస్తున్న కర్మాగారాన్ని కూటమి నేతలు మూయించగలిగితే స్వాగతిస్తానని, లేదంటే ప్రజలపక్షాన ఉద్యమానికి తాను సిద్ధమని మాజీ మంత్రి కారుమూరి వివరించారు.

## రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం

- ప్రభుత్వం దిగి వచ్చేవరకూ ఆందోళనలు
- రేపు కలెక్టరేట్‌లో వినతిపత్రాల అందజేత
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



నరసాపురంలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలో దగాపడ్డ రాష్ట్ర రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటాలు సాగిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రైతులకు అండగా శుక్రవారం కలెక్టరేట్‌లో పార్టీ తరపున వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 13న పార్టీ చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఎన్నికల వేళ రైతులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు పూర్తిగా ముఖం చాటేశారని విమర్శించారు. రైతుభరోసా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్స్యూరెన్స్ వంటి సదుపాయాలు లేక అన్నదాతలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగకపోవడం, రైతు సేవా కేంద్రాలు అలంకారప్రాయంగా మారడంతో రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలో పెడుతున్నారన్నారు. గద్దెనెక్కిన అతి తక్కువ సమయంలోనే రైతులను ఇంతలా దగా చేసిన ప్రభుత్వం మరొకటి లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, ముఖ్యంగా రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ దశలవారీ పోరాటాలు చేయడానికి నిర్ణయించిందని చెప్పారు. ప్రభుత్వం దిగి వచ్చి ప్రజలను ఆదుకునే వరకూ ఆందోళనలను పలు రూపాల్లో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు కామన బుజ్జి, ఇంజేటి జాన్ కెనడీ, కావలి నాని, పప్పుల రామారావు, పాలా రాంబాబు, బర్రి శంకరం తదితరులు పాల్గొన్నారు.

### ఆహార పరిశుభ్రత తప్పనిసరి



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): వ్యాపారులు ప్రజలకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని, పరిశుభ్రత లేకుంటే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేవీజీవీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాన్ ఇండియా పోస్టాక్ ట్రైనింగ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి ఫుడ్ వ్యాపారి అవగాహన, అనుభవం కలిగి ఉండటంతో పాటు భారతీయ ఆహార భద్రత సంస్థ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమమైన పోస్టాక్ కోర్సుల్లో శిక్షణ పొంది ఉండాలన్నారు. ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా పొంది ఉండాలన్నారు. భీమవరంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, శిక్షణ పొందిన వారిలో శుభ్రత పాటించే వారికే అవకాశం కల్పిస్తామన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన తినుబండారాలు విక్రయించేలా చూడాలన్నారు. అనంతరం డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లు, పోస్టాక్ ట్రైనింగ్ పార్టనర్ కేవీజీఎం కరపత్రాన్ని ఆవిష్కరించారు. పట్టణంలో ఫుడ్ వ్యాపారులకు ట్రైనర్ పి.యశోదా దేవి అవగాహన కల్పించారు.

## 10న ఉత్తర ద్వార దర్శనం

**9న గిరి ప్రదక్షిణ, స్వామివారి నిజరూప దర్శనం**



గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 10న శ్రీవారి ఉత్తరద్వార దర్శనాన్ని కల్పించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు ఈ దర్శన భాగ్యాన్ని కల్పిస్తామన్నారు. ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేక టికెట్ రుసుమును రూ.500లుగా నిర్ణయించామని, దీంతో పాటు ప్రస్తుతం ఉన్న రూ.100, రూ.200ల టికెట్లను సైతం భక్తులకు విక్రయిస్తామన్నారు. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినం ముందు రోజు 9వ తేదీన గిరి ప్రదక్షిణను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామివారి పాదుకా మండపం వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని, గోవింద దీక్షాధారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులకు స్వామి వారి నిజరూప దర్శన భాగ్యాన్ని కల్పిస్తామన్నారు. అలాగే వచ్చేనెల 10 నుంచి 20 వరకు ఆలయంలో అధ్యయనోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకుని వచ్చేనెల 14న స్వామివారి నిత్యార్జిత కల్యాణాన్ని రద్దు చేస్తున్నట్టు ఈఓ పేర్కొన్నారు.

## అగ్నిమాపక కేంద్రాలను ఆధునికీకరిస్తాం

**అగ్నిమాపక శాఖ ఏడీ శ్రీనివాసులు**



భీమడోలులో అగ్నిమాపక వాహనంలో ఓ భాగాన్ని పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

భీమడోలు: రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు రూ.253 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటితో కొత్త అగ్నిమాపక కేంద్రాలు, కేంద్రాల ఆధునికీకరణ, ఆధునిక పరికరాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అదనపు డైరెక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రానికి సంబంధించిన వివరాలను అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.253 కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులు కేటాయించాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా 17 అగ్నిమాపక కేంద్రాలను మంజూరు చేశామని, అలాగే 35 కేంద్రాల ఆధునికీకరణలో భాగంగా వసతుల కల్పన, రెస్క్యూ అడ్వాన్స్‌డ్ పరికరాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. వచ్చే ఏప్రిల్ తర్వాత వాటర్ వెండర్లు, హైడ్రాలిక్ పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. భీమడోలులో మినీ శకటాన్ని అందుబాటులోకి తేస్తామన్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖ, నెల్లూరు తదితర ప్రాంతాల్లో కెమికల్ ప్రమాదాల నివారణకు కెమికల్, బయాలజికల్, రేడియాలజికల్, న్యూక్లియర్ ఎమెర్జన్సీని ఎదుర్కొనే పరికరాలను సిద్ధం చేస్తామన్నారు. అలాగే అగ్నిమాపక సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

భీమవరం (ప్రకాశంచౌక్): సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పశ్చిమ డెల్టాకు సంబంధించి 1,176 ప్రాదేశిక నియోజకవర్గాలకు, 98 నీటి సంఘాలకు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 84 ప్రాదేశిక నియోజకవర్గాలకు, 14 నీటి సంఘాలకు, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నిక, నీటి వినియోగదారుల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపికకు ఎన్నికలను ఈనెల 14న నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈనెల 17న ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### 14, 15 తేదీల్లో ఎస్సీ, ఎస్టీల రాష్ట్రస్థాయి సమావేశాలు

భీమవరం: ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 14, 15 తేదీల్లో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య బుధవారం చెప్పారు. 14వ తేదీన విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ, 15న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె శ్యామ్‌ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పరశురాం హాజరవుతారని వెల్లడించారు.

### పెద్దల సభకు ఫిరాయింపుదారులా!

నూజివీడు: దేశంలో అత్యున్నత రాజ్యసభకు పార్టీ ఫిరాయింపుదారులను పంపడం దిగజారుతున్న రాజకీయ విలువలకు నిదర్శనమని సీపీఎం లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీ హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ముగ్గురు రాజ్యసభ సభ్యుల్లో ఇరువురిని వైఎస్సార్‌సీపీ నుంచి వలస వచ్చిన వారిని ఎంపిక చేయడం దారుణమన్నారు. ఏ ప్రభుత్వం ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవడం ఆర్ కృష్ణయ్యకు అలవాటుగా మారిందన్నారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తులు బీసీల సంక్షేమానికి ఎలా పాటుపడతారో బీసీలకే తెలియాలన్నారు. ముందే కుదిరిన ఒప్పందం మేరకే బీద మస్తాన్‌రావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారన్నారు. దీంతో నాగబాబును రాజ్యసభకు పంపాలన్న పవన్‌కళ్యాణ్ కలలు నెరవేరలేదన్నారు.

### కల్తీ ఆహారాల విక్రయంపై కేసు నమోదు



రిలయన్స్ మార్ట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ అధికారి ఎం.శ్రీనివాసరావు

ఆకివీడు: కాలం చెల్లిన, కల్తీ ఆహారాలు విక్రయిస్తున్న స్థానిక రిలయన్స్ మార్ట్‌పై కేసు నమోదు చేసినట్లు ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ అధికారి ఎం.శ్రీనివాసరావు చెప్పారు. కాలం చెల్లిన పచ్చళ్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో కాలం చెల్లిన వస్తువులతో పాటు, కల్తీ ఆహార పదార్థాల్ని విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు శ్రీనివాసరావు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో కల్తీ వస్తువుల విక్రయాలపై 20 కేసులు, కాలంచెల్లిన వస్తువుల విక్రయాలపై 25 కేసులు నమోదు చేయగా జేసీ కోర్టులో ఉన్నాయన్నారు. వాటిపై చర్యలు తీసుకుని, జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఎక్కడైనా కల్తీ ఆహార వస్తువులు విక్రయించినట్లు తెలిస్తే ఫుడ్ సేఫ్టీ అధికారి సెల్ నెంబర్ 98483 16338కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి ఏఎస్ఆర్ రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్, సిబ్బంది పాల్గొన్నారు.

## ● మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత



భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ మూలవిరాట్ దర్శనం బుధవారం నుంచి నిలుపుదల చేశారు. ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మచే అమ్మవారికి కళాపకర్షణ పూజలు నిర్వహించి గర్భగుడి తలుపులు మూసివేశారు. 61వ వార్షిక మహోత్సవాల సందర్భంగా అలంకరణ పనులు పూర్తి చేసి తిరిగి ఈనెల 25 తేదీన ఉదయం 10.30 గంటలకు భక్తులకు అమ్మవారి పునఃదర్శనం కల్పించనున్నారు. ఆలయం వద్ద పందిరి రాట వేసి ఉత్సవాల పనులకు శ్రీకారం చుట్టారు. – భీమవరం(ప్రకాశం చౌక్)

## ● నేత్రపర్వం.. ఏకాదశి ఉత్సవం



చినవెంకన్న దివ్య క్షేత్రంలో బుధవారం రాత్రి శ్రీవారికి ఏకాదశి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి పూజాధికాలు జరిపారు. అనంతరం స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. – ద్వారకాతిరుమల

## ● సందేశాత్మకంగా నాటిక పోటీలు



తల్లిదండ్రుల కష్టార్జితం మీద ఆధారపడొద్దు.. ప్రతి ఒక్కరూ తమ స్వశక్తితో ధనాన్ని ఆర్జిస్తూ తల్లిదండ్రుల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వాలంటూ ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. రచన తాళబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం కత్తుల రామ్మోహనరావు వహించారు. రెండవ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శించారు. తోలేరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో 20వ జాతీయ స్థాయి నాటిక పోటీలు బుధవారం జరిగాయి. – వీరవాసరం

# పంచాయతీ సొమ్ములు బొక్కేస్తున్నారు

- పంచాయతీ నిధులు గుటకాయస్వాహా చేస్తున్న సిబ్బంది
- రాయలం పంచాయతీలో రూ.2.30 కోట్లు స్వాహా చేసిన వైనం
- క్రిమినల్ కేసులకు కలెక్టర్ ఆదేశాలు
- అదే జాబితాలో దిరుసుమర్రు, విస్సాకోడేరు, చినఅమిరం పంచాయతీలు



రాయలం పంచాయతీ కార్యాలయం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ములు, ఇతర ఆదాయాలను కొందరు పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది కలిసి గుటకాయస్వాహా చేస్తున్నారు. అకౌంట్స్‌లోని రసీదులు(రిసీప్ట్స్ హెడ్) మార్చి వేసి పంచాయతీకి జమకావాల్సిన సొమ్ములను దర్జాగా వారి ఖాతాల్లో జమ చేసుకుని సొంతంగా వాడేసుకుంటున్నారు. జిల్లాలో కొన్ని పంచాయతీల్లో ఈ తంతు నడుస్తోంది. దీనిపై ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విచారణ చేయగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

**రాయలం పంచాయతీలో రూ.2.30 కోట్లు స్వాహా**

భీమవరం మండలంలోని ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనంలో ఉన్న రాయలం పంచాయతీలో ఇద్దరు సెక్రటరీలుగా, ఒక జూనియర్ అసిస్టెంట్ కలిసి ఏకంగా రూ.2,30,43,635 స్వాహా చేశారు. ఈ పంచాయతీలో అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ నాగరాణి జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ ఆధ్వర్యంలో ఇటీవల ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించి విచారణ చేయంచగా ఈ కుంభకోణం బయటపడింది. దీంతో అవినీతికి పాల్పడిన ముగ్గురు పంచాయతీ సిబ్బందిపై కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు క్రిమినల్ కేసులు నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పంచాయతీ సిబ్బందికి సహకరించిన ఆడిట్ అధికారులపై కూడా చర్యలు తీసుకుంటున్నారు.

**లిస్టులో మరికొన్ని పంచాయతీలు**

పలు పంచాయతీల్లో ఈవిధంగా సెక్రటరీలు అవకతవకలకు పాల్పడి నిధులు స్వాహా చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీకి ఫిర్యాదులు అందాయి. వాటిలో భీమవరం మండలం దిరుసుమర్రు, పాలకోడేరు మండలం విస్సాకోడేరు, భీమవరం వీలీన గ్రామం చినఅమిరం పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలపై కూడా ప్రత్యేక అధికారుల బృందంతో విచారణ చేసి సెక్రటరీల అవినీతి బాగోతాన్ని వెలికితీసే చర్యలు చేపడుతున్నారు. అలాగే అరోపణలు వస్తున్న పలు పంచాయతీలపై కూడా కలెక్టర్ అదేశాలతో విచారణకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది.

**“ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు**



పంచాయతీ నిధుల నిర్వహణ నిబంధనలు మేరకు ఉండాలి. నిధులు దుర్వినియోగం చేస్తు కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో కొన్ని పంచాయతీలపై ఫిర్యాదులు వస్తున్నాయి. కలెక్టర్ అదేశాల మేరకు ఆయా పంచాయతీల్లో విచారణ చేసి తప్పు జరిగితే చర్యలు తీసుకుంటాం.

– బి.అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి

**పారదర్శకంగా విచారణ చేస్తే..**

ఆరోపణలు వచ్చిన పంచాయతీల్లో జిల్లా అధికారులు పారదర్శంగా విచారణ చేస్తే మరికొందరు ఇంటి దొంగలు (అవినీతికి పాల్పడిన సెక్రటరీలు) బయటడే అవకాశం ఉంది. పంచాయతీ నిధులు స్వాహా చేయడానికి దొంగ బిల్లులు పెట్టడం, ఏదైనా చినపాటి పనిచేసినా వర్కర్లు లేదా కాంట్రాక్టర్లుకు చెల్లించాల్సిన లెక్క కంటే అధికంగా సొమ్ము వారి ఖాతాకు మళ్లించి తిరిగి వారి నుంచి వసూళ్లు చేసుకోవడం చేస్తుంటారు. లేదా రాయలం పంచాయతీ స్కామ్ మాదిరిగానే రశీదులు, రికార్డులు మార్చివేసి సొమ్ములు కాజేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి.

### 14న సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు

భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు ఈనెల 14వ తేదీన భీమవరంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్ జయరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని వంశీకృష్ణ నగర్‌లోని వోల్గా ఆర్చరీ అకాడమీలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు ఈనెల 23, 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. వివరాలకు ఇ సాహిత్, సెల్: 98491 81993 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్రబాబు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు మొత్తం 36 మంది హాజరయ్యారు. అపోలో ఫార్మసీ, ఎల్ఐసీ, శ్రీరామ్ చిట్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించారు. కళాశాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పీ రజిత, వీ వరలక్ష్మి, వైపీ ప్రవీణ్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కే ప్రవీణ్, కోఆర్డినేటర్ శ్యామ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

## గురుకులంలో విద్యాబోధనకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

బుట్టాయగూడెం: గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె బాట పట్టడంతో ఆయా పాఠశాలల్లో విద్యాబోధనకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, జేసీ పి.ధాత్రిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి, కేఆర్‌పురం, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులోని గురుకుల పాఠశాలల్లో విద్యాబోధనకు మొత్తం 19 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు చెప్పారు. చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో కూడా జిల్లా ఉపాధ్యాయులు విద్యాబోధన చేసేలా సర్దుబాట్లు చేశామన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాలు వచ్చే వరకూ ఆయా జిల్లాల్లో ఉపాధ్యాయులు పనిచేస్తారని జేసీ చెప్పారు.

**ఉపాధ్యాయుల అసంతృప్తి**

రాష్ట్రంలోని చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గత 25 రోజులుగా సమ్మెబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులు చేశారు. అయితే ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏ నుంచి 75 మంది సీఆర్‌టీ, ఎస్‌జీటీ ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఐటీడీఏ అధికారులు ఉత్తర్వులు ఇవ్వగా దీనిపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి, కేఆర్‌పురం, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గురుకుల పాఠశాలలో పనిచేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధపడగా మిగిలిన 55 మంది చిత్తూరు, కడప, కర్నూలు వెళ్లేందుకు సముచితంగా లేరని తెలిసింది. తాము ఆ ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించలేమని జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఒక వినతి పత్రాన్ని ఐటీడీఏ అధికారులకు అందజేసినట్లు సమాచారం.

### ఆల్ ఇండియా వాలీబాల్ పోటీల రిఫరీగా నాగరాజు



రిఫరీ నాగరాజును అభినందిస్తున్న నాయకులు

కైకలూరు: ఆల్ ఇండియా వాలీబాల్ పోటీల రిఫరీగా కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన బలే నాగరాజు ఎంపికయ్యారు. విజయవాడ కానూరు సమీపంలో ఈ నెల 12 నుంచి 15వతేదీ వరకు ఆల్ ఇండియా ఆహ్వాన వాలీ బాల్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు రిఫరీగా ఎంపికైన నాగరాజును బుధవారం వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే ఏసు, కొల్లి బాబీ, మల్లిఖార్జునరావు, సైదు ఆనందబాబు, ముంగర కొండలు అభినందించారు.

## తణుకు డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్లు

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు లభించినట్లు ఐఎస్ఓ సంస్థ ప్రతినిధి ఏ శివయ్య తెలిపారు. బుధవారం తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కళాశాలలో ఎనర్జీ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఐఎస్ఓ 50001, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఐఎస్ఓ 21091, గ్రీన్ ఎనర్జీకి సంబంధించి ఐఎస్ఓ 14001 సర్టిఫికెట్లను అందజేసినట్లు చెప్పారు. సోలార్ ప్యానల్స్, ఎలక్ట్రికల్ వైరింగ్ మొదలగు విషయాలను పరిగణనలోకి తీసుకుని ఈ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల ఈ సంవత్సరం స్వయం ప్రతిపత్తి సాధించినట్లు చెప్పారు. 2025 జనవరి 6న స్మార్ట్ ఆంధ్రా హ్యాక్‌థాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో జూనియర్స్ విభాగంలో 6 నుంచి 10వ తరగతి వరకూ, సీనియర్స్ విభాగంలో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, భూపాల్, మారుతీదేవి చౌదరి, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఐఎస్ఓ ప్రతినిధి శివయ్య



# ‘హ్యాకథాన్’ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఆ-హబ్, ఈపీడీసీఎల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ‘హాక్ ఏపీ హ్యాకథాన్’లో సృజనాత్మక ఆవిష్కరణలకు విద్యుత్ పంపిణీ సంస్థ బహుమతులు అందజేసింది. ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా బుధవారం జరిగిన 13వ ఎడిషన్ ‘హాక్ ఏపీ హ్యాకథాన్’ కార్యక్రమంలో స్టార్టప్ సంస్థలతో పాటు విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సహా 72 బృందాలు పాల్గొన్నాయి. పోటీల్లో భాగంగా.. విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను పలు స్టార్టప్ సంస్థల ప్రతినిధులు ప్రదర్శించారు. విజేతలుగా 7 బృందాల్ని ఎంపిక చేసి.. రూ.6 లక్షల విలువైన బహుమతులు అందించారు. హ్యాకథాన్‌లో వచ్చిన పరిష్కారాలను అమలుచేయడం ద్వారా సంస్థ సుమారు రూ.2 కోట్లు ఆదా చేయగలుగుతుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. స్టార్టప్ సంస్థలు అందించిన పరిష్కారాలు సంస్థలో మెరుగైన ఫలితాలకు, విద్యుదాఘాతాల నిరోధం, ఫీడర్ మీటర్ల కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు, ముందస్తుగా నిర్వహణ వైఫల్యాల గుర్తింపు, సులభతరమైన బిల్లింగ్, నిరంతర విద్యుత్ సరఫరాకు దోహదపడతాయన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ మాట్లాడుతూ విద్య, పారిశ్రామిక రంగాలను అనుసంధానించే దిశగా ఈ తరహా హ్యాకథాన్ల నిర్వహణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, సీజీఎం డి.సుమన్ కల్యాణి, ఆ-హబ్ సీఈవో రవి ఈశ్వరపు, తదితరులు పాల్గొన్నారు.

### జూనియర్ అసిస్టెంట్ అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోన కార్తికేయరెడ్డి అదృశ్యంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం ఈనెల 6వ తేదీన ఎప్పటివలె కార్తికేయరెడ్డి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. అనంతరం ఫోన్ వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడో తెలియదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో కార్తికేయరెడ్డి భార్య రాజేశ్వరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి ప్రేమరాజు తెలిపారు.

### వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

మొగల్తూరు: ఉప్పుటేరులో వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందాడు. ఎస్సై జి వాసు తెలిపిన వివరాల ప్రకారం పేరుపాలెం సౌత్, లైన్ పల్లిపాలెంకు చెందిన తిరుమాని నిరంజన్‌రావు (24) మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఉప్పుటేరులో వేటకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ జారి పడటంతో మృతి చెందాడు. మృతుని తండ్రి వడ్డికాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసు చెప్పారు.

## స్విమ్మింగ్‌లో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరు జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారని శాప్ స్విమ్మింగ్ కోచ్ బి గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన 9వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీలు వివరాలు ఆయన వెల్లడించారు. ఇందులో బి స్వామినాయుడు అద్భుత ప్రతిభ చాటి 4 బంగారు పతకాలతో పాటు అత్యంత వేగవంతమైన ఈతగాడుగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. అలాగే బీఆర్‌వీవీ భవాని కార్తీక్, పి రఘురామ్, ఎస్‌కే హలీల్, ఎస్‌కే హకీమ్, ఎం ధనుష్‌సాయి, బి స్వామినాయుడు, పి స్రగ్విత, సీహెచ్ పూర్వీ, జె యశస్విని, ఎండీ సిద్రా, యు మోహన్ దీప్తి వేర్వేరు విభాగాల్లో బ్యాక్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై మెడ్లే అంశాల్లో సత్తా చాటారన్నారు. మొత్తంగా జిల్లా క్రీడాకారులు 5 స్వర్ణ పతకాలు, 10 రజిత పతకాలు, 17 కాంస్య పతకాలతో 32 పతకాలు సాధించారని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి శ్రీనివాసరావు క్రీడాకారులను అభినందించారు.

### ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఉరి వేసుకుని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు టూటౌన్ ఎస్సై నాగకళ్యాణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు ఆర్ఆర్‌పేట ప్రాంతానికి చెందిన కాశీ ప్రియాంక (25) బ్యూటిషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు కొంతకాలం క్రితం బెల్లం శ్రీకాంత్‌తో వివాహమైంది. అతడు ఏలూరు జీజీహెచ్‌లో అనస్థీషియా టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతడికి ఇంతకుముందే మరో మహిళతో వివాహం కాగా ప్రియాంకను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిననాటి నుంచి ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. గత ఆదివారం భార్యభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో శ్రీకాంత్ బయటకు వెళ్లిపోయాడు. తిరిగి బుధవారం ఇంటికి వచ్చే సరికి ప్రియాంక ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు, ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. అయితే కుమార్తె మృతిపై ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి శ్రీకాంత్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## క్లుప్తంగా

### గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



విప్పర్రు గ్రామంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం పురస్కరించుకొని పడమర విప్పర్రు గ్రామంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా పలు సేవాకార్యక్రమాలు చేశారు. హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రి సురేష్‌రెడ్డి, కార్యదర్శి చెన్నా వెంకటరామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గణసల శ్రీను, లింగంపల్లి శేషగిరి, సంకు హరి, మానే గణేష్, పాలనాటి శివరామకృష్ణ పాల్గొన్నారు.

### సీపీఎం జిల్లా మహాసభను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఎం పార్టీ 26వ జిల్లా మహాసభలు ఈ నెల 20, 21, 22 తేదీలలో భీమవరంలో జరుగుతాయని, విజయవంతం చేయాలని తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) సర్వసభ్య సమావేశంలో బుధవారం యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, అధ్యక్షుడు సత్తి కోదండ రామిరెడ్డిలు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, వారికి బుద్ధి చెప్పాలన్నారు. రైతాంగ, ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### నిట్‌కు విద్యుత్ వాహనం బహూకరణ

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం పట్టణంలోని కెనరా బ్యాంకు శాఖ అధికారులు తొమ్మిది లక్షల రూపాయల విలువైన విద్యుత్ వాహనాన్ని బుధవారం నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ. రమణరావుకు అందజేశారు. డైరెక్టర్ రమణరావు మాట్లాడుతూ నిట్ అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. వాహనాన్ని బహూకరించిన బ్యాంకు అధికారులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు వసతి గృహాల నుంచి తరగతి గదులకు రావడానికి , తిరిగి వసతి గృహాలకు వెళ్లేందుకు ఈ వాహనాన్ని వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి, కెనరా బ్యాంకు సర్కిల్ హెడ్ సీజె.విజయలక్ష్మి, ఏజీఎం రామచంద్ర, గూడెం బ్రాంచి మేనేజర్ ఎస్.జనార్ధనరెడ్డి, నిట్ అధికారులు పాల్గొన్నారు.

### పురోహితుల నూతన కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక యాగర్లపల్లి గాయత్రి మందిరంలో బుధవారం శ్రీ గాయత్రి బ్రాహ్మణ పురోహిత సంఘ ఎన్నికలు జరిగాయి. 54 మంది సభ్యులు అన్ని పదవులకు పోటీ పడ్డారు. అధ్యక్షుడిగా ప్రయాగ కిషోర్ శర్మ, ఉపాధ్యక్షుడిగా తంగిరాల సుబ్రహ్మణ్య శర్మ, కార్యదర్శిగా పళ్ళావఝుల రాజేష్ శర్మ, సహ కార్యదర్శిగా కణ్వపురి దామోదర్‌శర్మ, కోశాధికారిగా మండవల్లి రమణలు ఎన్నికయ్యారు. వక్తలు మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. గౌరవాధ్యక్షుడు మర్ల విశ్వనాథ శర్మ, పూర్వ అధ్యక్షుడు తంగిరాల సూర్యనారాయణలచే నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం, సత్కారాలు జరిగాయి.

### మోదుగగుంటలో అన్నసమారాధన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామంలో వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. షష్టి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ కట్టా జానకీరామయ్య తెలిపారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ ఉప సర్పంచ్ వల్లేపల్లి సత్యనారాయణ, ఎమ్పీటీసీ దండుబోయిన వెంకటరమణ, అంకం రాంబాబు, కర్నాటి పోలిరెడ్డి, కేశబోయిన ధర్మారావు, సిద్ధా వీర్రాజు, వి.నాని తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో బుధవారం డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్‌చే పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మహేష్ మాట్లాడుతూ ప్రతి రోజు దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయడం వల్ల సమస్యలు తగ్గి ఇతరుల మీద ఆధార పడకుండా తమ పనులు తాము చేసుకోగలుగుతారని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి పాల్గొన్నారు.

### కంతేరు మాజీ ఎంపీటీసీ మృతి

ఇరగవరం: మండలంలోని కంతేరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత పంచాయతీ బోర్డు డైరెక్టర్ వెలగల సత్యనారాయణ రెడ్డి అనారోగ్య సమస్యలతో మంగళవారం మృతి చెందారు. పార్థివదేహానికి సర్పంచ్ గుడిమెట్ల ఆదిలక్ష్మి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ మృతి గ్రామానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ దుర్గ పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్‌తో ప్రజల్ని వంచించిన కూటమి

- 6 నెలలు గడిచినా అందని సంక్షేమం
- హైటెక్ టవర్, ఉపాధి అవకాశాలు ఎక్కడ అంటున్న తణుకువాసులు
- మోసపోయామంటున్న ప్రజలు
- సంక్షేమం కోసం ఎదురుచూపులు చూస్తున్న వైనం



తణుకు పట్టణం వ్యూ

తణుకు అర్బన్ : దేశానికి పెద్ద ఆస్తి యువతే.. ఇంటికో ఉద్యోగం ఇచ్చే బాధ్యత నాదే.. సూపర్ సిక్స్‌తో మీ బతుకులు బాగుచేస్తానంటూ ప్రజల్ని నమ్మబలికించి వంచించిన కూటమి సర్కారుపై ప్రజలు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సూపర్ సిక్స్ పథకాల హామీకి దిక్కులేకుండా లేకుండా పోయిందంటూ వాపోతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే తణుకు ప్రాంతంలో హైటెక్ టవర్ నిర్మిస్తానని తద్వారా ఇంటివద్ద నుంచే ఉద్యోగాలు చేసుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని మీకందిస్తానంటూ పలికిన మాటలు తణుకు వాసులు ఇంకా మదిలో నెవేసుకుంటూనే ఉన్నారు. ఇదేసభలో ప్రస్తుత కూటమి నేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లేక ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని తణుకును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 6 నెలలు గడిచినా ఈ హామీలు ఏమయ్యాయని ప్రజానీకం నోరెళ్లబెడుతున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే మనస్సు వారికి ఉంటే ఆ పాటికే హామీలకు తగినట్లుగా పునాదులు పడేవని కానీ హామీలతో తణుకు ప్రజానీకాన్ని వంచనకు గురిచేశారని ప్రజలు తిట్టుకుంటున్నారు.

**పింఛను వెయ్యి పెంచడం తప్ప ఏం చేశారు..**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన రూ.3 వేల పింఛన్‌కు అదనంగా మరొక వెయ్యి జతచేసి ఇవ్వడంతోపాటు అరకొరగా ఏడాదికి మూడు గ్యాస్ బండల ఉచిత పథకం తప్పించి సూపర్ సిక్స్‌లో ఏ పథకం అమలుచేయకపోవడాన్ని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. విద్యావైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన జగన్ సర్కారు హయాంలో ఇంటర్మీడియేట్ వరకు అమ్మ ఒడి పథకంలో రూ. 15వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యలో ఫీజు ఎంతైనా విద్యాదీవెన ద్వారా పూర్తి ఉచిత విద్య, వసతి దీవెనతో ఏడాదికి రూ.20వేలు అందచేశారు. దీంతో పేద కుటుంబాల్లో కూడా ఉన్నత చదువులు చదివే పరిస్థితి కలిగింది. ఇక చంద్రబాబు ప్రకటించిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, తల్లికి వందనం వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు నిలదీస్తున్నారు. సోషల్ మీడియాలో సైతం నీకు పదిహేను వేలు, నీకు పదిహేనువేలు అన్న ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడి మాటలు సైతం ప్రజలు, యువత కసిగా ట్రోల్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లుగా కూడాలేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

**జగన్ హయాంలో విరాజిల్లిన సంక్షేమాభివృద్ధి**

గత జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి విరాజిల్లింది. తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 2019 నుంచి 2024 వరకు రూ. 3300కోట్లు నిధులతో సంక్షేమం, అభివృద్ధికి ఖర్చుచేశారు. దీంతో ప్రజానీకం సంతోషం వ్యక్తం చేశారు.

## అంతన్నారు.. ఇంతన్నారు.. ఆ జాడే లేదు



గూడెం పట్టణం వ్యూ

తాడేపల్లిగూడెం: కూటమి నాయకులు అధికారం దక్కించుకోడానికి సూపర్ సిక్స్ అన్నారు. వంద రోజుల్లో అభివృద్ధి ఆనవాళ్లు చూపిస్తామన్నారు. అంతన్నారు. ఇంతన్నారు. పాలనలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయ్యింది. అరకొరగా రెండు పథకాలను విదిల్చి ఇదే అభివృద్ధి అన్నట్టుగా డాంబికాలు పోతున్నారు. కాని ఆ అభివృద్ధి జాడలు నియోజకవర్గంలో ప్రస్ఫుటంగా కనిపించడంలేదు. పింఛన్ హామీ నెరవేర్చారు. అమావాస పండుగకు గ్యాస్ సిలిండర్‌లకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను ఇంకా పట్టాలెక్కించలేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇంకా పడలేదు. రైతుభరోసా ఊసే లేదు. అమ్మ ఒడిని తల్లికి వందనంగా మార్చారు. పాలనలోకి కొచ్చిన తొలి ఏడాదిలో ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎన్నికల సమయంలో వారాహి యాత్రలో భాగంగా ఏప్రిల్ 29న ఇక్కడకువచ్చిన పవన్‌కళ్యాణ్ గూడెంను మార్కెట్ హబ్‌గా, ఎడ్యుకేషనల్ హబ్‌గా చేస్తామన్నారు. గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తామన్నారు. గూడెం విమానాశ్రయ భూములు అన్యాక్రాంతంకాకుండా చూస్తామన్నారు. మిలట్రీ మాధవరంలో క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. 180 రోజుల పాలన ముగుస్తున్నా ఏ ఒక్క ప్రాజెక్టు కార్యాచరణకు నోచుకోలేదు. వాణిజ్య కూడలితో పాటు విద్యాకేంద్రంగా పరిఢవిల్లుతున్న ఇక్కడ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు ఇంతవరకు ఫీజు రీయింబర్స్ మెంటు, వసతి కోసం విడుదల చేసే నిధులు రాలేదు. అల్పాదాయ వర్గాలు దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సున్నావడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, చేయూత , ఆసరా కాపు నేస్తం వంటివి వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూర్చే పథకాలకు శ్రీకారం చుట్టలేదు. దీంతో అన్ని వర్గాలు తీవ్ర నిరాశలో ఉన్నాయి. గత పాలనలో ఠంచన్‌గా క్యాలండర్ ప్రకారం బటన్ నొక్కి పథకాలకు సొమ్ములు వేసే వారు ఆ పరిస్థితి ప్రస్తుతం లేదు.

### పెట్టుబడి సాయం అందలేదు



సొంత వ్యవసాయంతో పాటు కౌలుకు వరిసాగు చేస్తున్నా. ఈఏడాది సార్వాసాగు ప్రారంభం నుంచి వర్షాలు, వరదల వల్ల పంట ముంపుబారిన పడింది. సాగు ఖర్చులు పెరగడంతోపాటు దిగుబడులు బాగా తగ్గడంతో సార్వాసాగులో నష్టాలే మిగిలాయి. గత ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేది. ప్రస్తుత ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా రైతు భరోసా రూ. 20 వేలు పెట్టుబడి సాయం విడుదల చేయలేదు. దాళ్వాసాగు చేపట్టడానికి అప్పులు చేయాల్సి వస్తుంది.

– కోరుకొల్లు వెంకట్రావు, రైతు, కంచుమర్రు

### సూపర్ సిక్స్ ఏది?



కూటమి ప్రభుత్వం ఏర్పడి 6నెలలు గడిచినా ఇంతవరకు ఇస్తానన్న హామీలు నెరవేర్చకపోవడంపై ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ రూపంలో ఇస్తానన్న సంక్షేమంలో కొన్ని కూడా ఇవ్వకపోవడం బాధాకరం. నమ్మి మోసపోయామనే ఉద్దేశ్యంలోకి ప్రజలు వచ్చారు. జగన్ హయాంలో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమాన్ని క్యాలెండర్ విధానంలో చెప్పిన నెలలో అందజేశారు.

– నూకల కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు

### ప్రజల్ని మోసం చేశారు



కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడిచినా ఇంతవరకు మాజీ ముఖ్యమంత్రి అందించి రూ. 3వేలు పింఛన్‌కు అదనంగా రూ. వెయ్యి పెంచారే తప్ప ప్రజలకు ఏం చేశారు. ఉచిత గ్యాస్ కూడా అరకొరగానే అందింది. చాలా మందికి ఉచిత గ్యాస్ సిలిండరు తాలూకా డబ్బు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్ని వంచించి మోసం చేశారు.

– షేక్ ఫహీమా, తణుకు నియోజకవర్గ మైనారిటీ సెల్ మహిళాధ్యక్షురాలు

### రైతు భరోసా ఇవ్వలేదు



రైతులను సరిగా పట్టించుకోవడంలేదు. గతంలో మాదిరి రైతుల సంక్షేమం గురించి ప్రభుత్వం సరిగా ఆలోచించడంలేదు. రైతుభరోసా ఇస్తామన్నారు. అవి ఇంకా రైతులకు రావడం లేదు. ఇబ్బందిగా ఉంది. సంక్షేమాన్ని విస్మరించారు.

– కొనకళ్ల ముత్తయ్య, జగ్గన్నపేట, తాడేపల్లిగూడెం

## మాలల సింహగర్జన సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాలల సింహగర్జన మహాసభ గుంటూరు నల్లపాడులో ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు చీకటిమిల్లి మంగరాజు విజ్ఞప్తి చేశారు. ముదునూరుపాడులో బుధవారం మాల మహానాడు కార్యదర్శి గెడ్డం అచ్చిబాబు, ఉన్నమట్ల ఏసురత్నం, బాబ్జి, ప్రేమ్‌బాబు, చిట్టిబాబు, మురళీ ఆధ్వర్యంలో మాల మహానాడు సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సింహగర్జన సభలో ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ, క్రిమిలేయర్, రాష్ట్రాల పరిధిలో వర్గీకరణ చేసుకోవచ్చునని, సుప్రీంకోర్టు తీర్పు, ప్రైవేట్ రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై భవిష్యత్తు కార్యాచరణ జరుగుతుందని తెలిపారు. లక్షలాది మంది మాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గుంపుల సత్యకృష్ణ, అశోక్‌బాబు, ప్రేమ్ కుమార్, విజయకుమారి, రాజు, జి.ప్రసాద్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకోవాలి

పీఠాధిపతి ఉమర్ ఆలీషా



అత్తిలిలో శ్రీ ఉమర్ ఆలీషాను సత్కరిస్తున్న షష్ఠి కమిటీ సభ్యులు

అత్తిలి: ఆదర్శమైన జీవన విధానానికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకోవాలని పిఠాపురం శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. బుధవారం సాయంత్రం అత్తిలి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళావేదికపై ఉమర్ ఆలీషా ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు. బాల్యదశ నుంచే క్రమశిక్షణతో కూడిన ఉన్నత విలువలను పెంపొందించుకోవాలని కోరారు. భగవద్గీత మానవ నడవడికను తెలియజేస్తుందన్నారు. త్రయ సాధన ద్వారా మానవ జీవన విధానాన్ని ముక్తిమార్గంలో పయనించేలా చూసుకోవాలన్నారు. రెడ్డి ఉషారాణి తాత్విక జ్ఞాన ఉపన్యాసం చేశారు. పోలిశెట్టి ఉషాపావని భక్తి గీతాలను ఆలపించారు. గీతావధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు పీఠం ప్రాధాన్యతను వివరించారు. ఈసందర్భంగా షష్ఠి కమిటీ సభ్యులు పీఠాధిపతి ఉమర్ ఆలీషాను సత్కరించారు. ముందుగా ఉమర్ ఆలీషా శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణతోనే అధికారులకు గుర్తింపు



సమావేశ మందిరంలో బదిలీపై వెళ్తున్నవారిని సన్మానించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విధి నిర్వహణలో అధికారులు అందించే సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బదిలీపై వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ భరత్, పంచాయతీ కార్యదర్శులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ గూడెం మండలంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎక్కడ పనిచేసినా బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. మండలాన్ని వదిలి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. అయితే వారి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, మండల పరిషత్ ఏవో సుజాత, పంచాయతీ ఈవోలు ఆర్‌వీ.బ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస చంద్రరాజు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది అశోక్, సీఆర్పీ బత్తుల నాని తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణస్వామికి విశేష పూజలు



వాసవి ఆలయంలో లక్ష్మీనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మార్గశిర మాసం ఏకాదశి పురస్కరించుకొని వాసవీ ఆలయంలోని లక్ష్మీనారాయణ స్వామికి పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. ఆర్యవైశ్యసంఘం సెక్రటరీ సున్న బాల త్రిపుర సుందరరావు పూజలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు.

**కృష్ణ మందిరంలో ఘనంగా గీతా జయంతి**

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలో గీతా జయంతి నిర్వహించారు. శ్రీ కృష్ణపరమాత్మకు సహస్రనామార్చన జరిగింది. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.

**దక్షిణముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు**

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డులో దక్షిణాముఖ సువర్చల సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. బుధవారం స్వామివారికి నాగవల్లి దళార్చన, సింధూర పూజలు, హోమాలు జరిగాయి. గీతా జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

## జాబ్‌మేళాలో 24 మంది ఎంపిక

తణుకు టౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహార్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 24 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన ఈమేళాలో మొత్తం 76మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపా రు. ఈమేళాలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్స్ లిమిటెడ్‌లు తమకు కావలసిన సిబ్బంది 24మందిని ఎంపిక చేసుకున్నట్లు తెలిపా రు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## నేటి నుంచి సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

అత్తిలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై ఈశిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12,13 తేదీలలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, వీఆర్వోలకు, 17,18 తేదీలలో మండలస్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, జీఎంఎస్‌కేలు, ఏఎన్ఎంలు, అగ్రికల్చర్ అసిస్టెంట్ల శిక్షణ ఇస్తామని తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న నేరంపై గొడ్డెళ్ళ శివకృష్ణ, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,310లు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు.

## కృష్ణారావు దాతృత్వం ఎనలేనిది



తణుకులో పాఠశాల స్థలదాత కృష్ణారావు వంశీకులను సత్కరించిన హెచ్‌ఎం పద్మావతి

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల స్థల దాత, మొట్టమొదటి ప్రధానోపాధ్యాయులు వీఎస్ కృష్ణారావు భౌతికంగా లేకపోయినా వారి ఆశీస్సులు విద్యార్థులకు మెండుగా ఉంటాయని పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. కృష్ణారావు వంశీకులు బుధవారం పాఠశాలను సందర్శించిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయన చేసిన దాతృత్వంతో నేడు ఎన్నో వేల మంది విద్యార్థి దశ నుంచి ఉన్నత స్థాయికి చేరుకున్నారని స్పష్టం చేశారు. అటువంటి మహనీయుడిని నిత్యం మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. కృష్ణారావు వంశీకులు దినకర్‌రావు, మురళీకృష్ణారావు, రాధాముర‌ళిలను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో బెస్ట్ అవుట్ గోయింగ్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని, పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేస్తామని చెప్పారు. అనంతరం అంతర్జాతీయ చిత్రకళలో 12 బంగారు పతకాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మల్లుల వెంకటలక్ష్మి, టి.మారుతీరావు, ఉపాధ్యాయులు వై.సీతామహాలక్ష్మి, రాధ, వెంకట్రాజు, దుర్గాప్రసాద్, అక్కింశెట్టి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇటుకులగుంట చెరువును రజకులకు అప్పగించాలి



ఇటుకులగుంట గ్రామంలో మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఇటుకులగుంట గ్రామంలోని 5.40 ఎకరాల చెరువును రజక వృత్తిదారులకు అప్పగించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో రజక వృత్తిదారులకు కేటాయించిన సోమన్న చెరువును రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకరాజు, జిల్లా కమిటీ సభ్యులు యండమూరి నాగేంద్రలు సందర్శించారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు మాట్లాడుతూ వృత్తిదారులకు కేటాయించినప్పుడు సోమన్న చెరువు 5.40 ఎకరాలు ఉండేదని, నీటి మట్టం 3.40 ఎకరాల్లో ఉండేదన్నారు. గట్లు ఏడు గజాలు వెడల్పున చెరువు చుట్టూ ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారులు లెక్కలు చూస్తే 2.10 ఎకరాలు చెరువు ఉందన్నారు. పంచాయతీలో ఉన్న మూడు గ్రామాల్లో రజకులు వృత్తి చేసుకుంటూ ఆ చెరువుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం కలగజేసుకుని గతంలో చెరువు ఎంతైతే ఉందో సర్వే చేసి వృత్తిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండలంలోని రజకులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పేరేపి వరలక్ష్మి, భువనగిరి పాపారావు, లక్ష్మణరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కొట్టు పరామర్శలు



వెంకటేశ్వరరావు మాస్టారు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కోరశిఖ వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు మృతికి గల కారణాలను ఆయన కుమారుడు హరినాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు, నాయకులు కొట్టు నాగేంద్ర, బండారు నాగు, వగ్వాల మాధవరావు, కోరశిఖ నాగరాజు, కొడమంచిలి సూర్యారావు, కామన నాగేంద్ర, కంకిపాటి నాని, అరిగెల అబ్బి ఉన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: జీకె జ్యూయలర్స్ జీకె ఆనంద్, జి బ్రహ్మాజీ సోదరుల తండ్రి గురజాడ కనకారావు ఈనెల 3న మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి మాజీ ఉపముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ జీకె సోదరులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, శిరిగినీడి విజయకృష్ణ, వట్టి బుజ్జి తదితరులు ఉన్నారు.

## నేడు సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

పెంటపాడు: ఈనెల 12,13 తేదీలలో పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు విడతలగా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. మలివిడత 17, 18 తేదీలలో జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

## పన్నులు చెల్లించండి

తాడేపల్లిగూడెం: పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించి పురపాలక సంఘానికి సహకరించాలని కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. బుధవారం ఆయన ఈ విషయంపై మాట్లాడారు. మునిసిపల్ కార్యాలయంలో ఈ పన్నులు చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.